సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఉన్నత శిఖరాలకు ఎదగాలి
విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం సూచించారు. - 8లో



పడిపోతున్న నిమ్మ ధర
వేసవిలో నిమ్మకాయకు మంచి ధర వస్తుందనుకున్న రైతులు సరైన రేటు లేక పోవడంతో దిగాలు చెందుతున్నారు. - 8లో



స్వాతి నక్షత్ర పూజలు
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వాతినక్షత్ర పూజలు నేత్రపర్వంగా చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

మహాశివుడికి సంప్రదాయ పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తగా చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీసుదర్శనహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయద్వార బంధనం చేశారు.

పాడి రైతుల సదస్సును జయప్రదం చేయాలి



రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

రాజాపేట : ఆలేరులో ఈనెల 24న జరిగే పాడి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పాడిరైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నర్సింహులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజ్‌గౌడ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రాజాపేటలో సోమవారం పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. నెలనెలా బిల్లులు చెల్లించకపోవడం, ప్రోత్సాహకం చెల్లించకపోవడం, పాల ధర పెంచకపోవడంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దాణ ధర కూడా పెరగడంతో పాడి పశువులను పోషించలేని స్థితిలో రైతులు ఉన్నారని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోతుందన్నారు. సదస్సులో పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బబ్బూరి పోశెట్టి, పాలసంఘం చైర్మన్ సందిల భాస్కర్ రమేష్, నాయకులు పల్లె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : భారత్ సైన్యంలో వివిధ కేటగిరీల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు విద్యార్హతల సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా జతపర్చాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారి తప్పులు.. రైతులకు తిప్పలు!

“ బొమ్మలరామరాం, మర్యాల, చీకటిమామిడి గ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రామీణ వికాస్ బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. సుమారు 4వేల మందికి రుణమాఫీ అయింది. కానీ, అందులో సగానికి పైగా రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ).. తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా మారడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్పుతో టెక్నికల్‌గా సమస్య ఏర్పడింది. దీంతో వికాస్ బ్యాంకులో రుణం తీసుకున్న రైతులు మూడు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. మరికొంత మంది రైతులకు అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేర్లు రాలేదు. వ్యవసాయ, బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినా సమాధానం లేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

“ భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ పరిధిలోని చందుపట్ల, ఎర్రంబెల్లి, గౌస్‌నగర్, బండసోమారం, వీరవెల్లి, ముస్త్యాలపల్లి, రామచంద్రాపురం, చీమలకొండూరు గ్రామాలకు చెందిన 2,989 మంది రైతులు స్థానిక ఎస్‌బీఐలో రుణాలు తీసుకున్నారు. ఇందులో నాలుగు విడతల్లో 1,100 మందికి రూ.8కోట్లు మాఫీ అయ్యాయి. ఎస్‌బీఐలో నగదు జమ అయినప్పటికీ రైతులకు ఇవ్వడం లేదు. పీఏసీఎస్ అవసరాల కోసం ఎస్‌బీఐ నుంచి అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో పీఏసీఎస్‌ను బ్లాక్ లిస్టులో పెట్టారు. దీంతో రుణమాఫీ జరిగిన రైతులకు డబ్బులు అందడం లేదు.

సాంకేతిక సమస్యలను సరిచేయని అధికారులు
- అర్హతలున్నా వర్తించని రుణమాఫీ
- జిల్లాలో ఇంకా 30 శాతం మంది ఎదురుచూపులు
- కొత్త రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న బ్యాంకులు
- ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేస్తున్న రైతులు



రుణమాఫీ చేయాలని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బొమ్మలరామారం మండల రైతులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : రేషన్ కార్డ్ ఎడిట్, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పిదాల వంటి సాంకేతిక సమస్యలు వేలాది మంది రైతులను రుణమాఫీకి దూరం చేసింది. ఇంకా 30 శాతం మంది రైతులు అర్హతలున్నా రుణమాఫీ పొందలేదు. డిసెంబర్‌లో జరిగిన నాలుగో విడతలోనూ ఉపశమనం లభించకపోవడంతో.. వీరంతా తమ రుణాలు ఎప్పుడు మాఫీ అవుతాయని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణిలో అర్జీలు సమర్పిస్తున్నారు.

నాలుగు విడతల్లో 80,962 మందికి మాఫీ
రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన రైతులందరికీ రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేసింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగు విడతల్లో 80,962 మంది రైతులకు రూ.669.73 కోట్లు మాఫీ అయ్యాయి. తొలి విడతలో రూ.లక్ష లోపు రుణాలు 36,483 మందికి 199.46, రెండో విడతలో రూ.లక్షన్నర లోపు 19,798 మందికి రూ.193.96 కోట్లు, మూడో విడతలో రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు 13,011 మందికి రూ.164.66 కోట్లు మాఫీ జరిగింది. నాలుగో విడతలో 11,690 మంది రైతులు రూ.111.65 కోట్లు లబ్ధి పొందారు. ఇంకా 30 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు.

మాఫీ వర్తించకపోవడానికి కారణాలివీ..
సాంకేతిక సమస్యలకు తోడు మానవ తప్పిదాలను సరిదిద్దాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వేలాది మంది రైతులు రుణమాఫీకి దూరం చేసింది. రేషన్ కార్డ్ ఎడిట్, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు, నంబర్లలో తప్పులు దొర్లడం, ఫోన్ నంబర్లు సరిపోలకపోవడం, ఖాతాలు క్లోజ్ చేయడం వంటి కారణాలతో చాలా మంది రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో రాలేదు. వీరంతా కలెక్టరేట్, రైతువేదికలు, వ్యవసాయ కార్యాలయాలు, పీఏసీఎస్‌ల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లలో ప్రభుత్వ సూచన మేరకు దరఖాస్తు చేసుకున్నారు. 4,300కు పైగానే దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అధికారులు వీటిని పరిశీలించి ఉన్నతస్థాయికి పంపారు. ఇటువంటి వారికి నాలుగో విడతలో రుణమాఫీ చేశారు. కానీ, చాలా మంది పేర్లు జాబితాలో రాలేదు. ప్రధానంగా ఏపీజీవీబీ, పీఏసీఎస్, డీసీసీబీ, వాణిజ్య బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. రుణాలు మాఫీ కాకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. వానాకాలం వరకైనా సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

“ **పేరువచ్చినా డబ్బులు జమ కాలేదు**



నాలుగో విడతలో రుణమాఫీ అయిందని జాబితాలో పేరు వచ్చింది. కానీ, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చడంతో టెక్నికల్‌గా సమస్య ఏర్పడినట్లు చెబుతున్నారు. నాతో పాటు చాలా మంది రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి.
–చిలువేరు రాజమల్లారెడ్డి, బొమ్మలరామరాం

“ **అధికారుల చుట్టూ తిరుగుతున్నా**



ఆలేరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.70 వేలు పంట రుణం తీసుకున్నా. మొదటి విడుతలోనే రుణమాఫీ జాబితాలో నా పేరు వచ్చింది. ఖాతాలో డబ్బు కూడా జమ అయింది. అయినా బ్యాంకు అధికారులు కొత్త రుణం ఇవ్వడం లేదు. కారణం అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. రుణం కోసం బ్యాంకు చుట్టు తిరుగుతున్నా.
– ఎస్. చంద్రారెడ్డి, బహుద్దూర్‌పేట

అంబేడ్కర్‌కు ప్రముఖుల నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం భువనగిరిలోని వినాయక చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా ఎస్సీ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకుల శ్యాంసుందర్ తదితర ప్రముఖులు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రపంచం గర్వించదగిన మేధావి అంబేడ్కర్ : ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
ప్రపంచం గర్వించదగిన మేధావి బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. తాను రచించిన రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు వజ్రాయుధం లాంటి ఓటు హక్కు కల్పించారని పేర్కొన్నారు. అంతేకాకుండా అన్ని వర్గాలు సమాన విద్య, సమాన హక్కులు, ప్రాథమిక హక్కులు పొందగలుగుతున్నాయంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లేనన్నారు. అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ : మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు.



భువనగిరిలో నిర్వహించిన జైభీమ్ ర్యాలీలో పాల్గొన్న దళిత, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

రైతన్నను ముంచిన వడగండ్ల వాన



మోటకొండూరు మండలం తేర్యాలలో వరి పైరును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య



చిర్రగూడూరులో వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసిన అధికారులు

మోటకొండూరు, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), ఆలేరు రూరల్ : జిల్లాలో ఆదివారం సాయంత్రం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన, ఈదురు గాలులకు భారీ నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. కోత దశలో ఉన్న వరి చేలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేలరాలాయి. వ్యవసాయ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేశారు. నష్టం నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : బీర్ల ఐలయ్య
ఈదురుగాలులు, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను సోమవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరిశీలించారు. రైతలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లిస్తామని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పంట నష్టం నివేదిక పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట నాయకులు యాస లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, యెల్లంల సంజీవరెడ్డి, గంగపురం మల్లేష్, కొంతం మోహన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.



అడ్డగూడూరులో ఈదురుగాలులకు రాలిన మామిడికాయలను చూపుతున్న మహిళా రైతు

సన్నాహక సమావేశాలు.. పాదయాత్రలు

- బీఆర్ఎస్ రజతోత్సవ సభ జన సమీకరణకు నేతల సన్నాహాలు
- ఒక్కో నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలించాలని లక్ష్యం

సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభపై పార్టీ నేతలు దృష్టి సారించారు. అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌లో ఇటీవల జిల్లా నేతలతో సమావేశమై సభకు జన సమీకరణపై దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు వారు సభ విజయవంతంపై తలమునకలయ్యారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ముగిసిన సన్నాహక సమావేశాలు
రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో ఇప్పటికే సన్నాహక సమావేశాలు ముగిశాయి. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, క్యామమల్లేష్ తదితర నాయకులు పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తుంగుతుర్తి నియోజకవర్గంలో సన్నాహక సమావేశం నిర్వహించాల్సి ఉంది.

పాదయాత్రలు
సభ విజయవంతం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ విద్యార్థి సంఘం, యువజన విభాగం ఆధ్వర్యంలో రాయగిరి నుంచి యాదగిరిగుట్టలోని వైకుంఠద్వారం వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలుతో పాటు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, డీసీసీబీ మాజీ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా వలిగొండ మండలం వేములకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నారు. పాదయాత్రను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అదే విధంగా పోటాపోటీగా వాల్‌రైటింగ్ చేస్తున్నారు. వరంగల్‌వైపు జాతీయ రహదారి, ప్రధాన రోడ్ల వెంట చలో వరంగల్, రజతోత్సవ సభను జయప్రదం చేయాలంటూ వాల్‌రైటింగ్ చేయడం ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది.

రాయగిరి నుంచి గుట్టకు పాదయాత్ర



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి, యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ భువనగిరి మండలం రాయగిరి నుంచి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి వైకుంఠద్వారం వరకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రకు యాదగిరిగుట్టలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, షిప్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి మాట్లాడారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అంతకుముందు రాయగిరిలో పాదయాత్రను పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. పాదయాత్రలో బీఆర్ఎస్ గుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, జనరల్ సెక్రటరీ పాపట్ల నరహరి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, నాయకులు మిట్ట వెంకటయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ఒగ్గు శివకుమార్, ప్రవీణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు ర్యాకల రమేష్, నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మిట్ట అరుణ్‌గౌడ్, ఆయా మండలాల యూత్, విద్యార్థి విభాగాల అధ్యక్షులు ఎండీ అజ్జు, పల్లె సంతోష్ గౌడ్, భగత్‌సింగ్, రాసాల ఐలేష్ యాదవ్, బాల్‌సింగ్, భానుచందర్, బండ జహంగీర్ పాల్గొన్నారు.

భూ భారతికి శ్రీకారం

భూ సమస్యలు ఇక వేగంగా పరిష్కారం
- భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జూన్ నుంచి అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అమలు



సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, సూర్యాపేట కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భూమిపై హక్కుల విషయంలో రైతులకు ఎదురయ్యే సమస్యలు ఇక క్షేత్రస్థాయిలోనే పరిష్కారం కానున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతిని తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి భూభారతి విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు.

పరిష్కారం కానున్న సమస్యలివే.. రెవెన్యూ రికార్డుల్లో గతంలో పట్టాదారు కాలమ్‌తో పాటు కబ్జాదారు కాలమ్ కూడా ఉండేది. అయితే ధరణి తీసుకువచ్చినప్పుడు కబ్జా కాలమ్‌ను తొలగించి పట్టాదారు కాలమ్‌ను మాత్రమే రికార్డుల్లో ఉంచింది. దీంతో గతంలో భూములు కొని పట్టాలు చేసుకోని వారు, సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వారు కబ్జాలో ఉన్నప్పటికీ వారికి ఆ భూమిపై హక్కులు లేకుండా పోయాయి. గతంలో అమ్ముకున్న వారికే ధరణిలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చాయి. ఇలాంటి సమస్యలు అనేకం ఉత్పన్నం అయ్యాయి. అదేవిధంగా ధరణి అమలులో భాగంగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములన్నింటినీ ఆన్‌లైన్ చేసే సందర్భంలో ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరుతో పట్టాలు ఎక్కడం, కొందరికి భూమి ఉన్నంతగా కాకుండా తక్కువగా, ఎక్కువగా పాస్‌బుక్కుల్లో ఎక్కడం, మరికొందరు తమ భూములను అమ్ముకున్నప్పటికీ వారే దొడ్డిదారిన ఆ భూమిని పాస్‌బుకుల్లో తమ పేరున ఎక్కించుకోవడం, మరికొందరు కుటుంబ సభ్యులు ముగ్గురు నలుగురు ఉన్నా ఒక్కరే పట్టా చేయించుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇలాంటివి ధరణిలో పరిష్కారం కాలేదు. దాంతో కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూ భారతి ద్వారా ఇలాంటి సమస్యలకు కోర్టుకు వెళ్లాల్సిన పని లేకుండానే క్షేత్ర స్థాయిలో పరిష్కరించుకోవచ్చు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవడం, అక్కడా పరిష్కారం కాకపోతే కలెక్టర్‌కు కూడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ధరణిలో పాస్‌బుక్ పొందిన పట్టాదారుడే తిరిగి వారే వారికి పట్టా చేస్తేనే పేరు మారేది. కలెక్టర్‌కు కూడా దాన్ని మార్చే అధికారం లేకపోవడంతో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అలాంటి వాటికి భూ భారతిలో మోక్షం లభించనుంది. ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ ఆగిపోతే ఆ డబ్బులు రైతులకు వచ్చేవి కావు. అలాంటివి ఇప్పుడు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. పట్టా భూమి పొరపాటున ప్రభుత్వ భూమి అని పడితే దాన్ని మార్పు చేయాలంటే సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇలా 2023 నుంచి అలాంటి సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు వాటితోపాటు పెద్ద మొత్తంలో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు కూడా మోక్షం లభించే అవకాశం ఉంది.

మొదటగా నాలుగు మండలాల్లో..
మొదట రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా భూ భారతిని అమలు చేయనున్నారు. జూన్ నుంచి అన్ని మండలాల్లో అమలు చేస్తారు.ఈ చట్టంలో క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లకు, ఆర్డీఓలకు అధికారాలు లభించనున్నాయి.

యువ వికాసానికి 31,902 అర్జీలు

- ముగిసిన దరఖాస్తు గడువు
- సెలవు రోజూ హార్డు కాపీల స్వీకరణ

భువనగిరిటౌన్ : రాజీవ్‌యువ వికాసం పథకం దరఖాస్తు గడువు ముగిసింది. సోమవారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా 31,902 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ 9,874, ఎస్టీ 2,579, బీసీ 16,990, ఈబీసీ 814, మైనార్టీ 1,590, క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు 55 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అర్ధరాత్రి వరకు దరఖాస్తు చేసుకోవడంతో వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా దరఖాస్తు గడువు పెంచినట్లు ప్రచారం జరుగుతుందని, ఇందులో వాస్తవం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన నిరుద్యోగుల నుంచి గడువు పెంచాలని పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయని, దీనిపై మంగళవారం ఏదైనా నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు



భువనగిరిలో దరఖాస్తుదారుల నుంచి హార్డుకాపీలు స్వీకరిస్తున్న సిబ్బంది

ప్రత్యేక కౌంటర్లు
దరఖాస్తుదారుల నుంచి హార్డ్ కాపీలు స్వీకరించేందుకు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం సెలవు రోజు అయినప్పటికీ సిబ్బంది అందుబాటులో ఉండి హార్డు కాపీలు స్వీకరించారు.

క్లుప్తంగా

పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడిగా వర్రె వెంకటేశ్వర్లు


వర్రె వెంకటేశ్వర్లు

మోత్కూర్: స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడిగా మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామానికి చెందిన వర్రె వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి శివశంకర్‌రావును నియమించగా.. ముగ్గురు సభ్యులలో ఒకరిగా వర్రె వెంకటేశ్వర్లును నియమితులయ్యారు. వర్రె వెంకటేశ్వర్లు ఉమ్మడి రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా పనిచేశారు. ఆయన నియామకం పట్ల మోత్కూరు ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భూమి చదును చేస్తుండగా బయల్పడిన శివలింగం


బయల్పడిన శివలింగం

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రణబోతు బాజీరెడ్డి ఆదివారం తన వ్యవసాయ భూమిని చదును చేస్తుండగా శివలింగంతో పాటు నాగప్రతిమ బయల్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని శివలింగాన్ని తిలకించారు. కాగా ఈ స్థలంలో గతంలో గుడి ఉండేదని గ్రామస్తులు తెలిపారు.

ఆలయంలో చోరీ

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని కమలానగర్‌లో గల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. సోమవారం నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ముఖద్వారం తలుపు తెరిచి లోపలికి ప్రవేశించి బీరువా తాళాలను తీశారు. అందులో ఉన్న సీతాదేవికి సంబంధించిన 15 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ యడవల్లి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీజే నిర్వాహకులపై కేసు

సూర్యాపేటటౌన్: నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు డీజే నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు సూర్యాపేట ఎస్పీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం చిలుకూరు మండలం బేతవోలులో బర్త్‌డే వేడుకల్లో డీజే వినియోగించడంతో.. స్థానికుల ఫిర్యాదు మేరకు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో కార్యక్రమ నిర్వాహకులు, డీజే యజమానులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసి డీజే సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. శనివారం సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూరి బజార్‌లో పెళ్లి వేడుకలో డీజే ఉపయోగించినందుకు గాను ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం సూర్యాపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బలరాంతండాలో బర్త్‌డే వేడుకల్లో డీజే పెట్టగా.. ఇద్దరు నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేశామని ఎస్పీ పేర్కొన్నారు.

పడిపోతున్న నిమ్మ ధర

- వేసవిలో లభించని ఆశించిన రేటు
- దిగుబడి పెరగడంతో ధర లేదంటున్న మార్కెట్ అధికారులు

నకిరేకల్: వేసవిలో నిమ్మకాయలకు మంచి ధర వస్తుందనుకున్న రైతులు సరైన ధర లేక దిగాలు చెందుతున్నారు. పది రోజుల క్రితం పండు నిమ్మ కాయలు బస్తాకు రూ.1800, పెద్ద సైజు కాయలు బస్తాకు రూ.2200, చిన్న సైజు కాయలు బస్తాకు రూ.1200 ధర లభించింది. గత రెండు, మూడు రోజుల నుంచి ఈ ధరలు సగానికి సగం పడిపోతున్నాయి. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌లో ప్రస్తుతం పండు కాయ బస్తా ధర రూ.1000 నుంచి రూ.1300, పెద్ద సైజు కాయ బస్తాకు రూ.1200 ధర పలుకుతోంది. చిన్న సైజు కాయ బస్తాకు రూ.200 ధర వస్తుంది. నిమ్మ ఎగుమతయ్యే ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో వర్షాలు కురవడంతో అక్కడ నిమ్మ కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రేటు ఉందని చెట్ల మీద చిన్న, పెద్ద అనే తేడా లేకుండా రైతులు కాయలను కోయడంతో దిగుబడులు పెరుగుతున్నాయి. ఇతర ప్రాంతాల్లో కూడా నిమ్మ అధికంగా దిగుబడి రావడంతో ఢిల్లీ, గుజరాత్ వంటి నగరాల్లో ధర పెరగడం లేదని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.


నకిరేకల్‌లోని నిమ్మ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన నిమ్మకాయల బస్తాలు

రోజుకు ఏడు వేల బస్తాల రాక..

ఉమ్మడి జిల్లాలో సుమారు 30వేల ఎకరాలకు పైగానే నిమ్మ తోటలు సాగువుతున్నాయి. దాదాపు 20వేల రైతు కుటుంబాలు, కౌలుదారుల కుటుంబాలు నిమ్మ తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తెలంగాణలో ఉన్న ఏకైక నిమ్మ మార్కెట్‌ను 2018 జూన్ 17న నకిరేకల్‌లో ప్రారంభించడంతో ఈ ప్రాంతంలో అత్యధిక విస్తీర్ణంలో నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఏటా మూడు లక్షల టన్నులకు పైనే నిమ్మ దిగుబడి వస్తోంది. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు గత 15రోజుల వరకు ప్రతిరోజు 2వేల నుంచి 3వేల వరకు నిమ్మకాయల బస్తాలు రాగా.. తాజాగా వారం రోజుల నుంచి రోజుకు 6వేల నుంచి 7వేల బస్తాలు వస్తున్నాయి. ఈ నిమ్మ మార్కెట్ నుంచి డీసీఎంలలో హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, గుజరాత్ ప్రాంతాలకు నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. నిమ్మ దిగుబడులు పెరగడంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా నిమ్మకాయలు అధికంగా రావడంతోనే ధరలు పడిపోయాయని మార్కెటింగ్ నిపుణులు అంటున్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి మంచి ధర వచ్చేలా చూడాలని నిమ్మ రైతులు కోరుతున్నారు.

నిర్దిష్టమైన ధర నిర్ణయించాలి



నేను మూడెకరాల్లో నిమ్మ సాగు చేశాను. 250 చెట్లు ఉన్నాయి. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు 13 బస్తాల నిమ్మకాయలు తీసుకొచ్చాను. ఒక్కో చిన్న సైజు కాయ బస్తాకు రూ.200 ధర వచ్చింది. పండు కాయలకు బస్తాకు రూ.1300, పెద్ద సైజు కాయలకు రూ.1200 మించి ధర రావడం లేదు. పది రోజుల క్రితం మార్కెట్‌కు వస్తే రోజుకు రూ.30 వేలు వచ్చేవి. నేడు రూ.10వేలకు మించి రావడం లేదు. ధర సగానికి సగం పడిపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి. నిమ్మ దీర్ఘకాలిక పంట అయినందున ప్రభుత్వం బస్తాకు ఒక నిర్దిష్టమైన ధర నిర్ణయించి అదే ధరకు కొనుగోలు చేయాలి.

– అన్నెబోయిన సురేందర్, బండమీదిగూడెం, శాలిగౌరారం మండలం

దిగుబడి పెరిగింది



వేసవికాలం అయినందున నిమ్మ దిగుబడులు బాగా పెరిగాయి. నకిరేకల్ ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా నిమ్మకాయలు మార్కెట్‌కు అధికంగా వస్తున్నాయి. 15రోజుల క్రితం నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు 3వేల బస్తాల నిమ్మకాయలు వచ్చేవి. నేడు 7వేల బస్తాలకు మించి దిగుమతి అవుతున్నాయి. దీంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి.

– నూక క్రాంతి, కొనుగోలుదారుడు, నిమ్మ మార్కెట్, నకిరేకల్

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని, ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు జీఓను విడుదల చేయడంపై హర్షిస్తూ నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డ్రోన్ సహాయంతో నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. అనంతరం సాయి మందిరం సమీపంలో స్టేడియంకు వెళ్లే దారిలో మహనీయుల విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక సాధికారిత కోసం జీవితాంతం పరితపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పూజర్ల శంభయ్య, మేనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, బత్తుల ఉశయ్యగౌడ్, పెద్ది సుక్కయ్య, కంపసాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మరణంలోనూ వీడని భార్యాభర్తల బంధం

- ఒక్కరోజు వ్యవధిలో గుండెపోటుతో ఇరువురు మృతి


దుబ్బ శంకరయ్య, లక్ష్మమ్మ (ఫైల్)

మునుగోడు: భర్త గుండెపోటుతో మృతిచెందడం తట్టుకోలేక ఒక్క రోజు వ్యవధిలోనే భార్య కూడా గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన నల్ల గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివెల గ్రామానికి చెందిన దుబ్బ శంకరయ్య(65), దుబ్బ లక్ష్మమ్మ(61) భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. శంకరయ్య మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకరయ్య ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం శంకరయ్యకు గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు సోమవారం శంకరయ్య మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకొచ్చారు. భర్త మృతిని తట్టుకోలేక ఆయన మృతదేహంపై పడి బోరున విలపించినా లక్ష్మమ్మ కూడా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెకు హైదరబాద్‌కు తరలించారు. అక్కడకి వెళ్లేసరికి ఆమె కూడా మృతిచెందింది. అన్యోన్యంగ జీవించిన భార్యాభర్తలు ఒక్క రోజు వ్యవధిలోనే మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ దంపతుల అంత్యక్రియలు సోమవారం పలివెల గ్రామంలో ఒకేసారి నిర్వహించారు.

ప్రమాదవశాత్తు ఆయిల్ పామ్ తోట దగ్ధం


గుర్రంపోడు: దగ్ధమైన ఆయిల్ పామ్ తోట

గుర్రంపోడు: మండలంలోని చామలేడు గ్రామానికి చెందిన కొండ పెద్దులు ఆయిల్ పామ్ తోట ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఉపాధిహామీ కూలీలు తన ఆయిల్ పామ్ తోట వెంట కాల్వలో కంపచెట్లు తొలగించి నిప్పు పెట్టి వెళ్లడంతో ఆ మంటలు తన తోటకు అంటుకొని చెట్లు దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు. మొత్తం మూడెకరాల తోటలో దాదాపు రెండెకరాలలో కాపు కొచ్చే దశలో ఉన్న ఆయిల్ పామ్ చెట్లు, డ్రిప్పు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.4లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్లే ఈ అగ్ని ప్రమాదం జరిగిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపారు.

చౌల్లరామారంలో..

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలం చౌల్లరామారం గ్రామంలోని సోట కుంటలో సోమవారం పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోట కుంటలో ఇటీవల ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు తొలగించిన కంప చెట్లకు సోమవారం నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు ఎగిసి పక్కనే ఉన్న వరి పొలాల వైపు వ్యాపించాయి. స్థానిక రైతులు గమనించి మోత్కూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

ప్రేమ పేరుతో మోసం.. యువతి ఆత్మహత్య

- న్యాయం చేయాలని కోదాడ– జడ్చర్ల హైవేపై కుటుంబ సభ్యుల రాస్తారోకో


మల్లేశ్వరి మృతదేహం

నిడమనూరు: నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో మోసం చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. యువతి కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం రాత్రి కోదాడ–జడ్చర్ల రహదారిపై బొక్కమంతలపహాడ్ గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన ధర్మారపు మల్లేశ్వరి హైదరాబాద్‌లోనే సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి హాస్టల్‌లో ఉంటూ నిమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. అదే గ్రామానికి కుక్కల జాన్‌రెడ్డి కూడా హైదరాబాద్‌లోనే రీహాబిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఒకే గ్రామం కావడంతో వీరిద్దరి మధ్య పరిచయం కాస్త ప్రేమగా మారింది. జాన్‌రెడ్డి ఇటీవల మరో యువతిని వివాహం చేసుకోవడంతో అది భరించలేక మల్లేశ్వరి ఆదివారం హాస్టల్‌లో విషపూరితమైన ఇంజెక్షన్ వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ సిబ్బంది గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధువులు మల్లేశ్వరి మృతదేహాన్ని బొక్కమంతలపహాడ్ గ్రామానికి తమకు న్యాయం చేయాలని జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై రాత్రి వరకు రాస్తారోకో చేపట్టారు.

చీకోటి ప్రవీణ్‌పై కేసు నమోదు

నల్లగొండ: హనుమాన్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆయనపై నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓవైసీ బ్రదర్స్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో సుమోటోగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం


విద్యార్థితో మాట్లాడుతున్న బుర్రా వెంకటేశం

సంస్థాన్ నారాయణపురం: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఒక లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సర్వేల్ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి బుర్రా వెంకటేశం అన్నారు. సర్వేల్ గురుకుల పాఠశాలలో 1983–84లో పదో తరగతి చదివిన ఆయన ఆదివారం పాఠశాలను సందర్శించారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. నూతనంగా 5వ తరగతి అడ్మిషన్ పొందిన విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్‌లో కలెక్టర్ అవుతానని సదరు విద్యార్థి చెప్పడంతో అభినందించారు. తాను ఈ పాఠశాలలో అడిష్మన్ కోసం తన అమ్మతో కలిసి వచ్చానని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకముందు పాఠశాలలో బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ఇతర మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లాఖాన్, పాల్వాయి రజిని, రామ్మోహన్‌రావు, గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి రమణకుమార్, డిప్యూటీ కార్యదర్శి ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ తదితరులున్నారు. అంతకుముందు మల్లారెడ్డిగూడెం గ్రామంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు నర్రి యాదయ్య ఇంట్లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు.

విద్యార్థులపై ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ

- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్


మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్

యాదగిరిగుట్ట: విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులకు, యువతకు కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని విమర్శించారు. పేద విద్యార్థులకు రూ.5లక్షల రుణాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కేబినెట్‌లో ఆ విషయాన్ని ప్రసావించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థుల హక్కులు సాధించేలా పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువతది కీలకపాత్ర అన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రాయగిరి నుంచి యాదగిరిగుట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ఒగ్గు శివకుమార్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ ర్యాకల రమేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాసాల ఐలేష్‌యాదవ్, కొంపల్లి నరేష్, పల్లె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట గ్రామంలో విషాదఛాయలు

- రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి


ఆదిత్య (ఫైల్)


ప్రవీణ్ (ఫైల్)

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన అప్పల కొండయ్య కుమారుడు ఆదిత్య(27), ఊర ముత్తయ్య కుమారుడు ప్రవీణ్(25) చిన్ననాటి నుంచి స్నేహితులు. వీరిద్దరు ఆదివారం రాత్రి కొత్తపేట నుంచి బైక్‌పై సూర్యాపేటకు బయల్దేరారు. మార్గమధ్యలో చీకటిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ హైవేపై ఉన్న జంక్షన్ వద్ద సూర్యాపేట వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఇరువురు పేద కుటుంబాలకు చెందినవారే..

మృతులిద్దరూ పేద కుటుంబాలకు చెందినవారే అని కొత్తపేట గ్రామస్తులు తెలిపారు. ఆదిత్య తండ్రి కొండయ్య అనారోగ్యంతో ఐదేళ్ల క్రితమే మృతిచెందాడు. డిగ్రీ పూర్తి చేసిన ఆదిత్య హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. శ్రీరామనవమి పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఆదిత్య సోమవారం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రవీణ్ తండ్రి స్థానికంగా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. డిగ్రీ వరకు చదివిన ప్రవీణ్ ఇంటి వద్దనే ఉంటూ కిరాణ దుకాణం నడుపుతున్నాడు. మృతులిద్దరు అవివాహితులు. చేతికందొచ్చిన యువకులు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నవ వధువు మృతిపై పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని పద్మశాలీకాలనీలో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన జెల్ల లావణ్య అలియాస్ గాయత్రి(19)ది హత్యేనని ఆమె కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. భువనగిరి మండలం అనాజ్‌పూర్‌కు చెందిన ఆమె తాత గుజ్జ సహదేవులు సోమవారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లావణ్యకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమెను అమ్మమ్మ–తాత పెంచి పెద్ద చేశారు. మార్చి 16న పద్మశాలీకాలనీకి చెందిన జెల్ల సంతోష్‌కుమార్‌తో ఆమెకు వివాహం జరిపించారు. పెళ్లైన 27 రోజులకే ఆమె ఆత్మహత్య చేసుకుంది. గాయత్రిని అత్త, మామ, భర్త హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆమె తాత ఫిర్యాదు చేయగా.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేస్తామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

యాదగిరిగుట్టలో స్వాతి నక్షత్ర పూజలు


- గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు, ఆలయాధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేశారు. ఉదయం 5గంటలకు కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అంతకుముందు కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. ఆలయంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలకారమూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు.


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు

- ఆయిల్‌పామ్ సాగులో పాటించాల్సిన మెళకువలపై ఉద్యానవన అధికారి సూచనలు



పెద్దవూర: రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రైతులకు సబ్సిడీపై మొక్కలు అందించడంతో జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండుతున్న ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే పంట ఎదుగుదల, దిగుబడిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల ఉద్యానవన అధికారి మురళి తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా వేసిన, ఎదిగిన పంట పెరుగుదలను కాపాడుకుంటూ, పంట పరిస్థితిని బట్టి రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు చేపట్టాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.


పెద్దవూరలో సాగవుతున్న ఆయిల్ పామ్

- ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయసు ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుమును, పచ్చిరొట్ట ఎరువు పంటగా నాటుకోవాలి. జనుము పూతకు వచ్చిన తరువాత చిన్న, చిన్న ముక్కలుగా కోసి పాదులో చుట్టూ వేయాలి.
- ప్రతి మొక్కకు రెండువైపులా ఒక్కో మైక్రోజెట్ (30 లేదా 40 లీటర్లు డిశ్చార్జ్ అయ్యేవి) అమర్చుకోవాలి.
- వేసవిలో చిన్న మొక్కలకు రోజుకు 150–165 లీటర్ల నీటిని అందించాలి. చెట్టుకు ఇరుపక్కల జెట్‌కు గంటకు 40 లీటర్ల సరఫరా సామర్థ్యం ఉంటే రోజుకు రెండు గంటలు నీరు అందించాలి. ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో వేసవిలో ప్రతి చెట్టుకు రోజుకు 250–330 లీటర్ల నీటిని అందించాలి.
- మూడేళ్ల లోపు వయస్సు ఉన్న మొక్కల్లోని పూగుత్తులను ప్రతి నెల అబ్లెషన్ సాదనంతో(రెండుసార్లు) తొలగించాలి.
- అవసరం మేరకు మాత్రమే (అన్ని చెట్లు కాకుండా) ఎండిన, విరిగిన లేదా చీడపీడలు ఆశించిన ఆకులను తొలగించాలి.
- ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలు వేసినట్లయితే ఆయిల్‌పామ్ మొక్కలతో పాటు అంతర పంటలకు కూడా సిఫారసు మేరకు నీరు తప్పనిసరిగా అందేలా చూసుకోవాలి.
- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో గెలలు కోసిన తరువాత నరికి ముక్కలు చేసిన ఆయిల్‌పామ్ ఆకులను, మగ పూల గుత్తులను, మొక్క జొన్న చొప్పను, ఖాళీ అయిన ఆయిల్‌పామ్ గెలలను, పాదుల్లో మల్చింగ్‌గా పరచాలి.
- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో పక్వానికి వచ్చిన ప్రతి గెలను, అల్యూమినియం కడ్డీ లేదా కత్తిని ఉపయోగించి కోయాలి.

- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటలకు నెలకు ఎకరాకు 5 కిలోల యూరియా, 3 కిలోల డీఏపీ, 5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్, 2.5 కిలోల మెగ్నీషియం సల్ఫేట్‌ను, ఒక కిలో బోరాక్స్‌ను విడివిడిగా నీటిలో కరిగించి ఫర్టిగేషన్ ద్వారా మొక్కలకు అందించాలి. ఇలా చేయడం వల్ల సమయం, ఎరువులపై ఖర్చు కూడా ఆదా చేయొచ్చు.
- ఆయిల్‌పామ్ తోటల్లో ఎక్కువగా పోషక లోపాలు కనిపిస్తే మట్టి, పత్ర విశ్లేషణ కొరకు నమూనాలను సిఫార్సు చేసిన రీతిలో సేకరించి విశ్లేషణ కోసం పంపాలి.